# 10. ప్రతిఫలం

రోజు రోజుకూ దిగజారుతున్నా దేవునిపైన్నే భారం వేసుకొని క్రమం తప్పకుండా గుడికెళ్ళే భక్తుడిలా విసుగు చెందకుండా చెట్టుదగ్గరి కొచ్చాడు సోమేశ్వరాశివు — చెట్టుపైకి నెమ్మదిగా పాకాడు— శవాన్ని భుజంపై వేసుకొని ఈసారి భేతాళుడి కవకాశమివ్వకుండా త్వరగా శ్మశానం చేరుకోవాలని గబగబా అడుగులేస్తున్నాడు—శవంలోని బేతాళుడత నితో "మానవా! నీ ముఖం చూస్తూంటే నిజాయితిగా బ్రతికినవాడిలా కన బడ్తున్నావు—నువ్వేం కోరి ఈ పని చేస్తున్నావో చెప్పు—" అన్నాడు

మూడు దశాబ్దాలపైగా ఉద్యోగంచేసి రిటైరయ్యాను — నీతిగా బ్రతుకాలనుకున్నా నేను పిల్లలకేం మిగిల్చలేకపోయాను— పెళ్ళీకెదిగిన కూతుర్లు—ఉద్యోగంలేని కొడుకు— నా ఎదపై కుంపెట్లా వున్నారు - నా అన్ని ప్రయత్నాలు విఫలంకాగా ఈ ప్రయత్నం చేస్తున్నాను. ...., తనలోతాననుకొని గంభీరంగా ముఖంపెట్టి త్వరత్వరగా నడుస్తున్నాడు సోమేశ్వరరావు—

"ఓ మనిషీ! నువ్వు చెప్పకున్నా నేనేం బాధపడను...పనిభారం తెలియకుండా ఉండడానికి నీ శ్రామికులు పాటలు పాడుకున్నట్లుగా బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను" అని కథ చెప్పడం మొదలు పెట్టాడు భేతాళుడు—

అది జంబూ ద్వీపంలోని ఓ దేశం — ఆ దేశం చాలా ఏళ్ళుగా పరాయి పాలనలోవుండి స్వతంత్రమైంది — అంటే స్వదేశీయుల పాల నలో కొచ్చిందన్నమాట — గద్దెలపై కూర్చున్న ప్రజా ప్రతినిధులు దేశంలోని నిరక్షరాస్యతను నిర్మూలించడానికెంతో ప్రయత్నం చేస్తు

న్నారు—అయితే దశాబ్దాలు గడిచినా ఆ దేశంలోని అక్షరాస్యుల సంఖ్య నూటికీ ముప్పయి దాటకపోవడం ఆ దేశం ప్రత్యేకత — మెడిసిన్, ఇంజనీరింగ్‌లాంటి చదువులా దేశంలోని మెజారిటీ ప్రజలకు భరించ రానివే—ఓ విద్యార్థి మెడిసిన్‌లో చేరి డాక్టరై తిరిగొచ్చేసరికి అతనిపై లక్షల రూపాయల సొమ్ము ఖర్చవుతుంది—అదీ ప్రజల సొమ్ము...కాని డిగ్రీలు చేతికిరాగానే పాశ్చాత్య దేశాల్లోని రంగు రంగుల జీవితాన్ని డబ్బును కోరుకుంటూ కొందరు—ఈ దేశంలో అవకాశాలు లేక కొందరు చురుకైన వాళ్ళు వెళ్ళిపోతూనే వుంటారు—ఒక్కో వ్యక్తిపై అంత డబ్బు ఖర్చు చేసింతర్వాత దేశానికుపయోగపడాల్సిన వాళ్ళు బయటకు వెళ్ళిపోతుంటే ప్రభుత్వం మౌనంగానే వుంటుంది—

అలాంటి దేశంలో ప్రకాశ్ ఎం డి. పూర్తి చేసి డాక్టర్ ప్రకాశ య్యాడు—మంచి తెలివి తేటలున్న ప్రకాశ్‌ను, అన్నిట్లోను మెరిటోరి యస్ ఐన ప్రకాశ్‌ను ఈ దేశంలోవుంటే లాభంలేదని, ఫారిన్‌వెళ్ళి పొమ్మని సలహా ఇచ్చారు మిత్రులు—కాని, ఎన్నో ఆదర్శభావాలతో చదువు పూర్తిచేసిన ప్రకాశ్ కేవలం డబ్బు సంపాదనకోసం విదేశాల కెళ్ళడం సరైంది కాదనుకున్నాడు— ఈ దేశంలోనే డాక్టర్ల అవసరం చాలా వుందని, అందులో పల్లెటూళ్లో మరీఎక్కువని ఓ పల్లెలో ప్రాక్టీస్ ప్రారంభించాడు "పెద్ద సదువులు చదివి గిక్కడికెందుకచ్చినవు —" అని ఆ ఊళ్లోని కొందరు పెద్దలు వ్యంగ్యంగా మాట్లాడినా అతడు పట్టిం చుకోలేదు—రోగులనెంతో శ్రద్ధగాజూస్తూ డబ్బు గూర్చి పిలదీసేవాడు కాదు—పేదలను, పెద్దలను అందర్నీ ఒకేవిధంగా చూస్తూ మంచిపేరు తెచ్చుకున్నాడు — అయితే ఆ ఊళ్లో అంతవరకున్న ఆర్.ఎమ్ పి, ప్రాక్టీస్ పూర్తిగా తగ్గింది—ప్రకాశ్ ఎంతో సేవాభావంతో పనిచేస్తున్నా

కొందరు ఊరిపెద్దల నుండి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వచ్చి ఆ ఊరి నుండే ప్రాక్టీస్ ఎత్తివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది—

తర్వాత అతడో జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ప్రాక్టీస్ ప్రారంభించాడు — అయితే తన ఆదర్శభావాలను మాత్రం వదులుకోక ఇతర డాక్టర్లు 30,40 రూపాయలు కన్సల్టేషన్ ఫీజుగా తీసుకుంటుంటే అతడు మాత్రం పదిరూపాయలే తీసుకునేవాడు .... నెమ్మదిగా శ్రద్ధగా చూస్తూ ఒక్కోరోగికి చాలా టైం తీసుకునేవాడు .... ఏ ప్రచారమూ, ఆకర్షణా ఆడంబరాల్లాంటివి లేకుండా పని కొనసాగిస్తున్నాడు... కాని విచిత్రమేమంటే-— డబ్బులు టేబుల్‌పై పెట్టందే చేయైనా ముట్టని డాక్టర్ల దగ్గర ప్రాణాపాయస్థితిలోవున్నా పైసలిమ్మైనాసరే ఫీజు తీసుకునే డాక్టర్ల దగ్గర రోగులు విపరీతంగావుంటే ప్రకాశ్ దగ్గర మాత్రం చాలా తక్కువగానే ఉండేవారు. — ఎన్నిరోజులు గడిచినా అతడార్థికంగా పెద్దగా పుంజుకోలేదు...—ఇతర డాక్టర్లు రోజుకు వేలల్లో సంపాదిస్తుంటే ప్రకాష్‌కు మాత్రం టి.వి లాంటి వస్తువులు కూడా మామూలు ఉద్యోగుల్లా ఇన్‌స్టాల్‌మెంటుల్లో కొనుక్కోవాల్సి వచ్చింది — వెనక్కి తిరిగి చూసుకున్న డాక్టర్‌గారికి తనపై తనకే జాలేసింది—

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు....

ఎన్నో ఆదర్శాలతో ఊళ్లో ప్రాక్టీస్ పెట్టిన ప్రకాష్ ఎందుకు ఎత్తివేయాల్సివచ్చింది—? పట్నంలో అందరికంటే తక్కువ ఫీజు తీసుకుంటున్నా అతని ప్రాక్టీసెందుకు పుంజుకోలేదు —? తర్వాత ఆడాక్టరు ఏం చేసుంటాడు—?

ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలిసీ చెప్పకపోయావో నీ కొడుక్కి ఏజ్‌బారయినా ఉద్యోగం దొరక్కుండా శపిస్తాను——" అని మౌనం వహించాడు భేతాళుడు—?

ప్రతి ఊళ్లోనూకొందరు గుంట నక్కల్లాంటి మోతుబరులుంటారు వాళ్ళకు ఊరి ప్రయోజనాలకన్నా తమ స్వార్థమే ముఖ్యం–డా॥ ప్రకాష్ గారు ఊరికెంత ఉపయోగంగా వున్నా తమలాంటివాళ్ళను పేదవాళ్ళను ఒకేవిధంగా చూడటంవల్ల వాళ్ళకు కోపం కల్గింది — ఆర్. ఎమ్ పి. లాంటివాళ్ళు మోతుబరులకు ఉచితంగా మందులిస్తూ మిగతావాళ్ళ దగ్గర ఎక్కువ డబ్బు గుంజుతారు — డా: ప్రకాష్ వచ్చింతర్వాత తమకే ప్రత్యేకత చూపకపోవడంవల్ల తమ, తాబేదారు ఆర్.ఎమ్ పి, ప్రాక్టీస్ తగ్గడంవల్ల అతన్ని అక్కడుండకుండా చేసారు—

బెర్నార్డుషా చెప్పినట్టు ఈ వ్యాపారయుగంలో, పోటీకాలంలో బాగా ప్రచారం కావాలి.— **CONSULTATION FREE, CURE GUARNTEED** లాంటి ఆకర్షణలూ కావాలి– అంతే కాకుండా రోగులను తీసుకురావడానికి ఏజంట్లు కావాలి—ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇంట్లో ప్రాక్టీసున్న డాక్టర్లు డబ్బులాగుతూ ఆస్పత్రిలో బెడ్ ఇవ్వడంలాంటివి చేస్తుంటారు—వాళ్ళపని బాగానే వుంటుంది– పోగా ఎక్కువ ఫీజు తీసుకునే డాక్టర్లంటే పెద్దడాక్టర్లన్న అభిప్రాయమున్న జనాలకు డా॥ ప్రకాష్ గారి పదిరూపాయల ఫీజుమీద నమ్మకం కుదురలేదు-—ఇన్ని కారణాల వల్ల అతని ప్రాక్టీస్ అలావుంది.—

ఇక మూడవ ప్రశ్నకు సమాధానం ... తన ఆదర్శాలే తనకు ఎదురు తిరుగగా అందరిలాగే తానూ మారి విరామం లేకుండా విచక్షణా రహితంగా డబ్బు సంపాదించడానికే సర్వసన్నద్ధుడై వుంటాడు..."

తానాశించిన సమాధానాలు సోమేశ్వర్రావు నుండి రాగానే శవంతో సహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు.

[జీవగడ్డ 4 ఏప్రిల్ 86]